# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత్ – రష్యా దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను పెంచే లక్ష్యంతో 2030 ఆర్థిక సహకార కార్యక్రమానికి ఇరు దేశాలు అంగీకరించాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు.**

2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడలో జరిగే కృష్ణవేణి సంగీత కార్యక్రమంలో ఈరోజు పాల్గొంటారు.**

3. **తెలంగాణలోని వరంగల్ విమానాశ్రయం పనులను మార్చి లోగా ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**

4. **గిరిజన ఉద్యమ నాయకుల విలువలు ఎప్పటికీ మార్గదర్శకంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు.**

5. **భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక భూమిక పోషించిన, డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ వర్ధంతి ఈరోజు.**

==========================

భారత్ – రష్యా దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను పెంచే లక్ష్యంతో 2030 ఆర్థిక సహకార కార్యక్రమానికి ఇరు దేశాలు అంగీకరించాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఢిల్లీలో నిన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో నిన్న జరిపిన ద్వైపాక్షిక సమావేశం అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. రెండు దేశాల మధ్య ప్రాధాన్య రంగాలు, దీర్ఘకాలిక ఆర్థిక సంబంధాల వృద్ధిలో వేగం పెంచేందుకు ఇరు దేశాలు కృషి చేస్తున్నాయని ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొంటూ..

వాయిస్.27 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఉదయం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కృష్ణవేణి సంగీత కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ మధ్యాహ్నం గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం జిల్లా అధ్యక్ష పదవులు, రాష్ట్ర కమిటీ ఎంపికపై పార్టీ నేతలతో చర్చిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

-------------------------

తెలంగాణలోని వరంగల్ విమానాశ్రయం పనులను మార్చి లోగా ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో 58 కోట్ల 84 లక్షల రూపాయలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. దేశంలోనే వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని, రైతు సంక్షేమం కోసం రైతు భరోసా, రైతు బీమా అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరిస్తూ..

వాయిస్...27 సెకన్లు

---

దేశవ్యాప్తంగా గత నాలుగు రోజులుగా ఇండిగో విమాన సేవలకు అంతరాయం కలిగింది. వెయ్యికి పైగా ఇండిగో విమాన సర్వీసులను ఆ సంస్థ నిన్న కూడా రద్దు చేసింది. ఈ అంశంపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. రానున్న మూడు రోజుల్లో విమాన సర్వీసులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు.

---

కేరళలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ- సర్ కార్యక్రమం గడువును భారత ఎన్నికల సంఘం మరో వారం రోజుల పాటు పొడిగించింది. ఈ నెల 11తో ముగియాల్సిన ఎన్యూమరేషన్ దశను ఈనెల 18 వరకు కొనసాగించనున్నట్లు తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం.. ముసాయిదా ఓటరు జాబితాను ఈ నెల 16కు బదులుగా 23న విడుదల చేస్తామని , అలాగే తుది ఓటరు జాబితాను ఫిబ్రవరి 14కు బదులుగా ఫిబ్రవరి 21న ప్రకటించనున్నామని ఎన్నికల అధికారులు తెలిపారు.

---

స్వాతంత్ర ఉద్యమంలో గిరిజన హక్కుల కోసం పోరాటం చేసిన గిరిజన ఉద్యమ నాయకుల విలువలు ఎప్పటికీ మార్గదర్శకంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహించిన 6వ జాతీయ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ సొసైటీ సంప్రదాయతీ కళా ఉత్సవం ఉద్భవ్-2025 ముగింపు వేడుకల్లో ఆమె నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇలాంటి వేడుకలు భవిష్యత్తు తరాలకు ఒక మార్గదర్శకంగా ఉటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి 22 రాష్ట్రాల నుంచి 405 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన 18 వందల మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు మంత్రి వివరిస్తూ..

వాయిస్.. 30 సెకన్లు

---

కాశీ తమిళ సంగమం 4.0లో భాగంగా వారణాసిలోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో విద్యా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 200 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ విభాగాలలో కాశీ తమిళనాడుల మధ్య గల ఆధ్యాత్మిక, తాత్విక సంప్రదాయాల గురించి ఈ సందర్భంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న పద్మశ్రీ పండిట్ రాజేశ్వర్ మాట్లాడుతూ, శతాబ్దాలుగా, దక్షిణాది ప్రజలు కాశీ సంస్కృతిలో భాగమైయ్యారని చెప్పారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అజిత్ కుమార్ చతుర్వేది మాట్లాడుతూ, సంగమం అనేది కొత్త భాష, కొత్త స్నేహాలు, కొత్త అవగాహనల సారాంశం అని పేర్కొన్నారు.

---------------------------

భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక భూమిక పోషించిన, డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ వర్ధంతి ఈరోజు. రాజ్యాంగ పరిషత్తు సభ్యునిగా విశేష కృషి చేసి రాజ్యాంగ రచనలో ఆయన కీలకపాత్ర పోషించారు. మహామేధావిగా, సంఘ సంస్కర్తగా, సర్వ మానవాళి సమానత్వానికి కృషి చేసి.. న్యాయశాస్త్ర కోవిదునిగా కీర్తిగాంచిన అంబేద్కర్... 1956 డిసెంబర్ 6వ తేదీన తుదిశ్వాస విడిచారు. దేశానికి అందించిన సేవలకుగాను భారత ప్రభుత్వం ఆయనకు 'భారతరత్న' పురస్కారాన్ని అందించింది. అంబేద్కర్ మహాపరి నిర్వాణం చెందిన ఈరోజును పురస్కరించుకొని ఆయన గతంలో పార్లమెంటులో చేసిన ప్రసంగాన్ని ఒకసారి గుర్తు చేసుకుందాం...

వాయిస్ – 23 సెకన్లు

---------------------------

దక్షిణ ఆఫ్రికా జట్టు భారత పర్యటనలో భాగంగా భారత్, దక్షిణ ఆఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న వన్ డే సిరీస్‌లో మూడో వన్ డే ఈరోజు మధ్యాహ్నం ప్రారంభమవుతుంది. ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం వేదికగా ఈ మ్యాచ్ జరుగనుంది. ప్రస్తుతం సిరీస్ 1–1తో సమానంగా ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు సిరీస్ సొంత చేసుకుంటుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ,

వాయిస్..29 సెకన్లు

మరో వైపు.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలితీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తెలంగాణాలోని ఉత్తర ప్రాంత జిల్లాలలో చలి తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================